


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 278 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | గురువారం 11 జూన్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :278 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | THU 11 JUNE 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## కుట్రలు తప్ప జగన్‌కు అభివృద్ధి పట్టదు

- అన్ని వ్యవస్థలను జగన్ నాశనం చేశారన్న కొల్లు రవీంద్ర
- రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని వెల్లడి
- ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని విమర్శ

- మిగతా 2లో

## స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు

# కోటి పరిహారం ఇవ్వాలి

- ఆ కుటుంబంలో పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి
- శ్రీ వైయస్ జగన్ డిమాండ్
- లేని పక్షంలో మా ప్రభుత్వం ఏర్పడగానే మేము ఆ పని చేస్తాం
- నెల రోజుల్లోగా కోటి చొప్పున పరిహారం ఇస్తాం
- విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడేందుకు అన్ని విధాలా కృషి చేశాం
- అందుకే ఆ 5 ఏళ్లలో ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోయింది
- రెండుసార్లు ప్రధానికి లేఖ రాశాం. ప్రత్యక్షంగా విజ్ఞప్తి చేశాం



పెన్ పవర్ డెస్క్: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఆ కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కూడా ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవేళ చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఆ పని చేయకపోతే, కొంచెం ఓపిక పట్టాలని, దేవుడి దయ వల్ల తమ ప్రభుత్వం ఏర్పడగానే, నెల రోజుల్లో కోటి రూపాయల చొప్పున పరిహారం ఇస్తామని ఆయన వెల్లడించారు. సంస్థలో గతంలో జరిగిన ప్రమాదాల్లో బాధితులకు కనుక, తగిన సహాయం అంది ఉండకపోతే, వారిని కూడా ఆదుకుంటామని ఆయన చెప్పారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. తాడేపల్లి నుంచి నేరుగా విశాఖ చేరుకున్న శ్రీ వైయస్ జగన్ తొలుత సెవెన్‌హిల్స్ ఆస్పత్రికి వెళ్లి, అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను

- మిగతా 2లో




## సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ

### చంద్రబాబు ప్రశంసలు

- న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు
- సరైన సమయంలో, సరైన స్థానంలో దేశానికి మోదీ సరైన నాయకుడని వ్యాఖ్య
- అధికారం కోసం కాకుండా, దేశ ప్రయోజనాల కోసమే ఎన్డీయే ఏర్పడిందని స్పష్టం
- ప్రపంచ సవాళ్ల మధ్య కూడా దేశ ఆర్థిక వ్యవస్థకు మోదీ స్థిరత్వం తెచ్చారని ప్రశంస
- మోదీ నాయకత్వంలోనే 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమని ధీమా

- మిగతా 2లో



## జగన్‌కు స్టీల్ ప్లాంట్ అనే పదం పలికే అర్హత కూడా లేదు

- జగన్ విశాఖ పర్యటన నేపథ్యంలో అనిత విమర్శలు
- స్టీల్ ప్లాంట్ భూములను రాజధాని అవసరాలకు వాడుకోవాలని జగన్ భావించారని విమర్శ
- కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య

- మిగతా 2లో

## మోదీ మైలురాయి.. ఆలయంలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రత్యేక పూజలు



- భారత్‌లో అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానిగా మోదీ రికార్డు
- జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించిన ప్రధాని
- ఈ సందర్భంగా ఆలయంలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రత్యేక పూజలు
- ప్రపంచ సవాళ్ల మధ్య దేశానికి స్థిరమైన నాయకత్వం లభించిందని వ్యాఖ్య

- మిగతా 2లో

# దేశాన్ని కాంగ్రెస్ అగాధంలోకి నెట్టింది

- సుదీర్ఘకాలం ప్రధానిగా మోదీ రికార్డు
- ఈ సందర్భంగా ఎన్డీయే సమావేశంలో కీలక ప్రసంగం
- 'హిందూ గ్రోత్ రేట్ కాదు.. కాంగ్రెస్ గ్రోత్ రేట్' అని విమర్శ
- 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని వెల్లడి
- వికసిత భారత్ ఇప్పుడు 140 కోట్ల కల అని ధీమా
- 2014లో ఆశ.. ఇప్పుడు ఆత్మవిశ్వాసమన్న మోదీ



పెన్ పవర్ డెస్క్:భారత చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన నేతగా జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయే కూటమి సమావేశంలో కీలక ప్రసంగం చేశారు. ఈ ఘనత తన వ్యక్తిగత విజయమేమీ కాదని, ఎన్డీయే కుటుంబం సాధించిన ఉమ్మడి విజయమని పేర్కొన్నారు. అదే సమయంలో కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, 2014 తర్వాత దేశంలో చోటుచేసుకున్న మార్పులను ప్రస్తావించారు. ఆయన ప్రసంగంలోని కీలక అంశాలు.. నెహ్రూ రికార్డును అధిగమించడం తన జీవితంలో ప్రత్యేక ఘట్టమని మోదీ అన్నారు. ఇంతకాలం ఎన్నికైన ప్రధానిగా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

- మిగతా 2లో

## దిగ్గజ దర్శకుడికి అధికారిక వీడ్కోలు.. తమిళనాడు ప్రభుత్వ కీలక నిర్ణయం

- ప్రభుత్వ లాంఛనాలతో దిగ్గజ దర్శకుడు భారతీరాజా అంత్యక్రియలు
- ప్రకటించిన తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్
- నిర్మాతల సంఘం విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూల స్పందన
- తమిళ సినిమాకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం
- భారతీయ సినిమాలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కొనియాడిన టీఎఫ్‌ఏపీఏ



పెన్ పవర్ డెస్క్:దిగ్గజ చలనచిత్ర దర్శకుడు భారతీరాజా అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రకటించారు. తమిళ చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన అసమాన సేవలకు, ఆయన స్థాయికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు

- మిగతా 2లో

## ఒమన్ తీరంలో ట్యాంకర్‌పై క్షిపణి దాడి....

# ముగ్గురు సిబ్బంది గల్లంతు

- ఒమన్ తీరంలో కెమికల్ ట్యాంకర్‌పై క్షిపణి దాడి
- ఘటనలో ముగ్గురు సిబ్బంది గల్లంతు
- నౌకలో ఉన్న 28 మందిలో 24 మంది భారతీయులు
- పరిస్థితిని పర్యవేక్షిస్తున్న భారత విదేశాంగ శాఖ



పెన్ పవర్ డెస్క్:గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మరో సారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒమన్‌లోని సోహార్ ఓడరేవుకు ఈశాన్యంగా 20 నాటికల్ మైళ్ల దూరంలో, పలావు పతాకంతో ప్రయాణిస్తున్న ఒక కెమికల్ ట్యాంకర్‌పై బుధవారం అనుమానిత క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది గల్లంతయ్యారు.'సెట్టెబెల్లో' అనే ఈ నౌకపై దాడి జరిగిన వెంటనే, దాని ఇంజిన్ గదిలో మంటలు చెలరేగినట్లు

- మిగతా 2లో

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి.. మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం!

- గతంలో వీపనగండ్ల వెళ్లినప్పుడు మినీ స్టేడియం కావాలని జూపల్లిని అడిగిన స్థానిక యువత
- తన సొంత భూమి ఇస్తానని నాడు మాట ఇచ్చిన జూపల్లి
- రూ. 1.50 కోట్లకు పైగా విలువున్న భూమిని విరాళంగా ఇచ్చిన మంత్రి



పెన్ పవర్ డెస్క్: రాజకీయాల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే నేతలు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో తాను ఒకడినని నిరూపించుకున్నారు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. యువత, క్రీడాకారుల భవిష్యత్తు కోసం ఆయన ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. మినీ స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని కేటాయిస్తూ బుధవారం అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు.గతంలో వీపనగండ్ల మండల పర్యటనకు వెళ్లిన సమయంలో.. అక్కడ స్థానిక యువత, క్రీడాకారులు

- మిగతా 2లో

## భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్: ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

- ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు
- 'మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు' అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్
- చర్చల విషయంలో జాప్యం చేస్తే భారీ మూల్యం తప్పదని హెచ్చరిక
- అమెరికా హెలికాప్టర్ కూల్చివేతతో పెరిగిన ఉద్రిక్తతలు



పెన్ పవర్ డెస్క్:అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్టకు చేరాయి. చర్చల ప్రక్రియలో ఇరాన్ జాప్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. "మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనం సృష్టిస్తున్నాయి. ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై మరిన్ని దాడులు చేసే అవకాశం ఉందని సంకేతాలను ఆయన ఇచ్చారు. బుధవారం 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందించిన ట్రంప్,

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### ఒమన్ తీరంలో ట్యాంకర్‌పై క్షిపణి దాడి....

# ముగ్గురు సిబ్బంది గల్లంతు

- మొదటి పేజి తరువాయి

యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సంస్థ ధ్రువీకరించింది. సమాచారం అందిన వెంటనే ఒమన్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నౌకలో మొత్తం 28 మంది సిబ్బంది ఉండగా, వీరిలో 24 మంది భారతీయులు ఉన్నారు. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. తాజా పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని, ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ద్వారా సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నామని వెల్లడించింది. గల్లంతైన సిబ్బంది కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇరాన్‌కు మద్దతిస్తున్న నౌకలను లక్ష్యంగా చేసుకుని అమెరికా చేపడుతున్న సైనిక చర్యల నేపథ్యంలోనే ఈ దాడులు జరుగుతున్నాయని అంతర్జాతీయ భద్రతా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జూన్ 8న కూడా ఇదే తరహాలో "మారివెక్స్" అనే ట్యాంకర్‌పై దాడి జరగ్గా, అందులోని 24 మంది భారతీయ సిబ్బందిని ఒమన్ అధికారులు సురక్షితంగా రక్షించిన విషయం విదితమే. తాజా ఘటన నేపథ్యంలో హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న భారత నావికుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## దేశాన్ని కాంగ్రెస్ అగాధంలోకి నెట్టింది

- మొదటి పేజి తరువాయి

ఈ విజయాన్ని తన వ్యక్తిగత విజయంగా చూడడం లేదన్నారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు, కార్యకర్తలు, కోట్లాది ప్రజల సహకారంతోనే ఈ ప్రయాణం సాధ్యమైందని పేర్కొన్నారు. దేశ ప్రజల రాజకీయ పరిణతి వల్లే స్థిర ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. 2014కు ముందు దేశం అస్థిరత, అనిశ్చితి కారణంగా నష్టపోయిందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ దేశాన్ని అవినీతి, విధానపరమైన వైఫల్యాలు, నిరాశలోకి నెట్టిందని ఆరోపించారు. అభివృద్ధి నెమ్మదిగా సాగడాన్ని 'హిందూ గ్రోత్ రేట్'గా పిలవడం తప్పని, దాన్ని 'కాంగ్రెస్ గ్రోత్ రేట్'గా పిలవాలని అన్నారు.

గత 12 ఏళ్లలో 25 కోట్ల మందికిపైగా పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు. ఇది ప్రభుత్వ విధానాలు సరైన దిశలో ఉన్నాయనే విషయాన్ని నిరూపిస్తోందన్నారు. వికసిత భారత్ లక్ష్యం ఇప్పుడు కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదన్నారు. దేశ ప్రజలందరి కలగా, సంకల్పంగా అది మారిందని పేర్కొన్నారు.

మౌలిక వసతుల అభివృద్ధిలో భారీ పురోగతి సాధించినట్లు వివరించారు. 2014లో 74 విమానాశ్రయాలు ఉండగా ఆ సంఖ్య ఇప్పుడు 160కి చేరిందని చెప్పారు.

ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రో సేవలు, రక్షణ ఎగుమతులు, డిజిటల్ లావాదేవీల్లో దేశం గణనీయ పురోగతి సాధించిందని మోదీ పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్ తయారీ, సౌర విద్యుత్ ఉత్పత్తి, సెమీకండక్టర్ రంగాల్లో భారత్ ప్రపంచ స్థాయిలో ముందుకు వెళ్తోందని తెలిపారు.

యువత, మహిళలు, రైతులు, మధ్యతరగతి ప్రజల ఆశయాలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి పరుగులో ఎవరూ వెనుకబడొద్దనే ఉద్దేశంతో పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు.

# భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్: ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

"ఇరాన్ సైన్యం ప్రస్తుతం తీవ్ర అస్తవ్యస్త స్థితిలో ఉంది. వారి నౌకాదళం, వాయుసేనలు దాదాపుగా ఉనికి కోల్పోయాయి. చర్చలకు రావడంలో వారు ఇప్పటికే చాలా ఆలస్యం చేశారు, ఇప్పుడు దానికి తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదు" అని పేర్కొన్నారు.

అమెరికాకు చెందిన ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్‌ను కూల్చివేసిన ఘటన తర్వాత ఈ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి ప్రతిచర్యగా, మంగళవారం హార్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు దాడులు నిర్వహించాయి. ఇది కేవలం ఆత్మరక్షణ కోసం చేపట్టిన చర్యేనని యూఎస్ సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బందిని సురక్షితంగా రక్షించినట్లు వెల్లడించింది. అయితే, తమ డ్రోన్‌ను అమెరికా హెలికాప్టర్ ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఇరాన్ వాదిస్తోంది. ఇందుకు ప్రతీకారంగా బహ్రెయిన్, జోర్డాన్, కువైట్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్ అణు, సైనిక కేంద్రాలపై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతోంది. తాజా పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగగా, స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి.. మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం!

- మొదటి పేజి తరువాయి

తమకు ఒక మినీ స్టేడియం కావాలని మంత్రి జూపల్లిని అభ్యర్థించారు. వారి కోరికపై సానుకూలంగా స్పందించిన మంత్రి, స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని ఇస్తానని నాడు మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తూ.. వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెం. 532/ఆ లో తన పేరిట ఉన్న 4 ఎకరాల భూమిని క్రీడాకారుల అభివృద్ధి కోసం అందజేశారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఈ భూ బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా పూర్తయింది. వీపనగండ్ల మండల తహశీల్దార్ లాగిన్ ద్వారా నిర్వహించిన ఈ ఆన్‌లైన్ ప్రక్రియలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేసి భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు. మంత్రి కేటాయించిన ఈ నాలుగు ఎకరాల భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ. 1.50 కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ చారిత్రాత్మక భూ బదిలీ ప్రక్రియకు సాక్షులుగా కాంగ్రెస్ నాయకుడు మునిగొండ గోపి, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ డిజిటల్ సంతకాలు చేశారు. మంత్రి తీసుకున్న ఈ ఉదార నిర్ణయంపై వీపనగండ్ల మండల ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువత, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే.. గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతమైన ప్రతిభ గల యువకులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ఒక గొప్ప వేదిక లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి

- మొదటి పేజి తరువాయి

పరామర్శించారు. అనంతరం కిమ్స్ ఆస్పత్రికి చేరుకున్న ఆయన, అక్కడ కూడా స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను, క్షతగాత్రులను పరామర్శించారు. వారి కుటుంబాలను ఓదార్చారు.

బాధితుల పరామర్శ తర్వాత సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వద్ద శ్రీ వైయస్ జగన్ మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా శ్రీ వైయస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**ఒక్కసారి బేరీజు వేసి చూడండి:**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో స్టీల్ మెల్టింగ్ వర్క్‌షాప్‌లో జరిగిన ప్రమాదంలో ఇప్పటికే 9 మంది చనిపోయారు. ఇంకా వేర్వేరు ఆస్పత్రుల్లో మరో 5గురు చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరి పరిస్థితి చాలా విషమంగా ఉంది. దాదాపు 95 శాతం బర్న్స్.

నేను ఇవాళ కొన్ని ప్రశ్నలు సూటిగా అడుగుతున్నాను. మానవత్వం ఏ మాత్రం ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి, మంచి చేయండి. అలాగే అందరూ ఆలోచించాలి. స్టీల్ ప్లాంట్‌లో కార్మికులు ఎలా బ్రతుకుతున్నారు? వారి పరిస్థితి ఎలా ఉంది? అనేది ఆలోచించాల్సిన అవసరం ఉంది. 2024 వరకు వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో కార్మికులు ఎలా ఉన్నారు? ఇప్పుడు వారి పరిస్థితి, టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఎలా ఉంది? అన్నది అందరూ బేరీజు వేసుకోవాలి.

**సంస్థను కాపాడుకునేందుకు ఇవన్నీ చేశాం:**

అప్పట్లో ఇదే ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రస్తావన వస్తే, అప్పుడు మా ప్రభుత్వం గట్టిగా ఆపింది. ఆ మేరకు 2021 ఫిబ్రవరి 6న ప్రధానిగారికి ఒక లేఖ రాశాం. ఏ రకంగా ఈ ప్లాంట్‌ను ఎలా నిలబెట్టాలో అందులో చాలా వివరంగా ప్రస్తావించాం. ఆ తర్వాత నెల రోజుల తర్వాత, 2021 మార్చి 9న మరో లేఖ రాశాం. ఇంకా ఆ తర్వాత, 2021, మే నెలలో అసెంబ్లీలో తీర్మానం కూడా చేశాం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరించవద్దని, దాన్ని ఎలా నడపవచ్చో కూడా చాలా స్పష్టంగా చెప్పాం. ఆ మేరకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి, అన్ని వివరాలతో కేంద్రానికి కూడా పంపాం. స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ఆ విధంగా అన్ని విధాలుగా కృషి చేశాం. అలా సంస్థను, ఉద్యోగులను కాపాడగలిగాం.

అంతే కాకుండా 2022, నవంబరు 12న ప్రధానిగారు విశాఖ వచ్చినప్పుడు జరిగిన సభలో, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ఆ సభలోనే ప్రధాని గారిని కోరాం. మా పార్టీ అంత గట్టిగా నిలబడింది కాబట్టి, ఉద్యోగులకు తోడుగా నిలబడింది కాబట్టి, సంస్థ ప్రైవేటీకరణ జరగలేదు.

**10 వేలకు పైగా ఉద్యోగులు తగ్గారు:**

ఆరోజు మా ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌లో రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులంతా కలిసి 28 వేల మంది పని చేయగా, ఈ రెండేళ్లలో 10,500 మందికి పైగా ఉద్యోగులు తగ్గారు. 6,500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. వీఆర్ఎస్ ప్రకటించి బలవంతంగా 1800 మందిని తప్పించగా, మరో 2,500 మంది పదవీ విరమణ చేశారు. దీంతో ఈరోజు సంస్థలో కేవలం 16 వేల మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు.

**స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై కక్ష సాధింపు:**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇప్పుడు ఉన్న ఉద్యోగుల పరిస్థితి దారుణం. వారికి నాలుగున్నర నెలల జీతాలు పెండింగ్. ఎప్పుడూ చూడని విధంగా, దేశంలో ఎక్కడా జరగని విధంగా, తొలిసారిగా ఉద్యోగస్తుల జీతాలు.. ప్రొడక్షన్‌తో లింక్ పెట్టారు. అంటే ఉత్పత్తి ఆ స్థాయిలో ఉంటేనే జీతాలు. లేకపోతే లేదు అన్న నిబంధన విధించారు. దేశంలో ఎక్కడా, ఏ సంస్థలో ఇలాంటి విధానం లేదు.

ఇంకా ఉద్యోగుల క్వార్టర్లకు గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో విద్యుత్ వినియోగంలో యూనిట్‌కు కేవలం 50 పైసలు మాత్రమే వసూలు చేయగా, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంటు బిల్లు యూనిట్‌కు ఏకంగా రూ. 8.50కి పెంచారు. ఆ విధంగా వారిపై ఒత్తిడి తెచ్చి, క్వార్టర్లు ఖాళీ చేయించే కుట్ర చేశారు.

ఉద్యోగులకు ఇప్పటి వరకు ఈ రెండేళ్లలో నో బోనస్. నో మెడికల్ ఫెసిలిటీస్. నో హెచ్చార్‌ఏ. నో ఎల్‌టీసీ. నో ఎల్ఎల్‌టీసీ. నో లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్. నో ఇన్సెంటివ్స్. ఈ మాదిరిగా ఉద్యోగులు దారుణ పరిస్థితిలో పని చేస్తున్నారు.

**ఆ ప్యాకేజీని వేటి కోసం వాడారంటే..:**

ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి రూ. 11,440 కోట్ల ప్యాకేజీ సాధించామని చంద్రబాబుగారు, ఆయన కుమారుడు, మంత్రులు గొప్పగా చెప్పుకున్నారు. నిజానికి ఆ ప్యాకేజీ ఇక్కడ నిర్వహణ కోసమో, భద్రత మెరుగపర్చడం కోసమో, సామర్థ్యం పెంచడం కోసమో కాకుండా, కేవలం ఉద్యోగులకు వీఆర్ఎస్ అమలు, జీఎస్టీ బకాయిల చెల్లింపు, ఇంకా బ్యాంక్ రుణాలు కొంత తీర్చడం కోసం వాడారు.

**తప్పిదం లేకపోయినా కార్మికులు బలయ్యారు.**

ఆ కుటుంబాలు బాధ పడుతున్నాయి:

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇప్పుడు జరిగిన ప్రమాదం అత్యంత బాధాకరం. ఈ ఘటనలో ఉద్యోగులు, కార్మికుల తప్పిదం ఏ మాత్రం లేదు. లిక్విడ్ మెటల్ పొంగి, బ్లాస్ట్ అయింది. అలా ఎందుకు జరిగిందంటే.. మిక్స్ సరిగ్గా చేయకపోవడం, రా మెటీరియల్ సరిగ్గా కలపకపోవడం, రా మెటీరియల్‌లో నాణ్యత లోపించడం కారణం. అందుకే ఈ ప్రమాదంలో ఎక్కడా ఉద్యోగుల తప్పిదం లేదు.

ఇక్కడ మానవత్వం చూపాల్సిన చోట.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తున్న తీరు అమానవీయం. ఒక్కసారి ఆలోచన చేయండి.

ఒక కేస్ స్టడీ: నా పక్కనే.. భాగ్యశ్రీ అనే బాధితురాలు ఉంది. ఆమె తండ్రి పేరు పెంటయ్య. 14 నెలల క్రితం ఇక్కడే, ఇదే సంస్థలోనే ఈ మాదిరిగానే ప్రమాదం జరిగి, పెంటయ్య చనిపోయాడు. ఆయన పర్మినెంట్ ఉద్యోగి. మాస్టర్ టెక్నీషియన్. 2025, ఏప్రిల్ 1న ప్రమాదంలో చనిపోయాడు. ఆయన కూతురు భాగ్యశ్రీ. ఆయనకు ఇంకా ఇద్దరు కొడుకులు. నవీన్, ప్రసాద్. వారి తండ్రి చనిపోయినప్పుడు పిల్లలు ఇద్దరికి నెలలోనే ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. ఆ ఉద్యోగాలు ఇవ్వలేదు సరికదా, చివరకు పరిహారం కూడా చెల్లించలేదు. ఇది దారుణం.

**విచిత్రంగా నారా లోకేష్ మాటలు:**

అవి వారి హక్కు. 'బోడి' మీరిచ్చేదేమిటి?:

ప్రమాద బాధితులకు పరిహారం విషయంలో మంత్రి నారా లోకేష్ చాలా విచిత్రంగా మాట్లాడాడు. ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు మొత్తం రూ. 1.72 కోట్లు వస్తాయని చెబుతున్నావు. అది రెగ్యులర్‌గా వచ్చేది. 'బోడి' మీరిచ్చేది ఏమిటి? మరి ప్రభుత్వం నుంచి ఏం ఇస్తున్నట్లు? ఆ రూ. 1.72 కోట్లు అది వారి హక్కు.

ఇంకా ఉద్యోగులకు రావాల్సిన గ్రూప్ ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, రిస్క్ ఇన్సూరెన్స్.. అన్నీ కలిపి రూ. 1.45 కోట్లు వస్తాయి. మరోవైపు సంస్థ తన వంతుగా రూ. 25 లక్షలు ఇస్తుంది. ఇంకా ప్రధాని సహాయనిధి నుంచి రూ. 2 లక్షల చొప్పున వస్తుంది.

మరి 'బోడి' రాష్ట్ర ప్రభుత్వం ఏమిస్తోంది. మీకు మీరుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. వాళ్లకు హక్కుగా వచ్చేది వస్తోంది తప్ప, రాష్ట్ర ప్రభుత్వంగా మీరు ఇస్తున్నది ఏమీ లేదు.

# కుట్రలు తప్ప జగన్‌కు అభివృద్ధి పట్టదు

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు జవాబుదారీగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని రాష్ట్ర మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ విచ్చలవిడిగా వ్యవహరిస్తూ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు.

రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొల్లు రవీంద్ర తెలిపారు. "గడిచిన రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అత్యద్భుతంగా అభివృద్ధి చేశాం. కుట్రలు, కుతంత్రాలు చేయడం తప్ప జగన్‌కు రాష్ట్ర అభివృద్ధి అస్సలు పట్టదు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారు" అని మండిపడ్డారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో సాధించిన ప్రగతిని, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలందరికీ వివరించబోతున్నామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

## జగన్‌కు స్టీల్ ప్లాంట్ అనే పదం పలికే అర్హత కూడా లేదు

వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో.. ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంశంపై గత ఐదేళ్లలో జగన్ వ్యవహరించిన తీరును తప్పుబడుతూ ఘాటైన ఆరోపణలు చేశారు. అసలు జగన్‌మోహన్ రెడ్డికి "విశాఖ స్టీల్ ప్లాంట్" అనే పదం పలికే అర్హత కూడా లేదని హోంమంత్రి స్పష్టం చేశారు.

వైకాపా ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను రాజధాని అవసరాల కోసం వినియోగించుకోవాలని జగన్ భావించారని, ఈ విషయాన్ని ఒక సీనియర్ ఐఏఎస్ అధికారే స్వయంగా వెల్లడించారని అనిత పేర్కొన్నారు. "స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు సంవత్సరాల తరబడి ఆందోళనలు చేస్తుంటే.. జగన్ కనీసం ఒక్కరోజు కూడా ధర్నా ప్రాంగణానికి వెళ్లి వారికి మద్దతు తెలపలేదు. అప్పట్లో కార్మికులను విమానాశ్రయానికి పిలిపించుకుని మాట్లాడిన జగన్.. ఇప్పుడు కూడా కార్మిక సంఘాల నాయకులను తన వద్దకే పిలిపించుకుని రాజకీయం చేస్తున్నారు" అని హోంమంత్రి మండిపడ్డారు.

ఒకప్పుడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్.. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కృషితో 99 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేసే స్థితికి చేరుకుందని వంగలపూడి అనిత వెల్లడించారు. కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందంటూ ఆమె పలు కీలక అంశాలను ప్రస్తావించారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదాల్లో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి తొలిసారిగా 'శాశ్వత ఉద్యోగం' కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని కేంద్ర ఉక్కు మంత్రి హెచ్.డి. కుమారస్వామి తీసుకున్నారని తెలిపారు.

మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రస్తుతం రూ. 60 లక్షల నుండి రూ. 1 కోటి వరకు బీమా ప్రయోజనాలు అందుతున్నాయని చెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్కసారి కూడా కేంద్ర ఉక్కు మంత్రిని విశాఖకు తీసుకురాలేకపోయారని, కానీ ప్రస్తుత కేంద్ర మంత్రి కుమారస్వామి స్వయంగా ప్లాంట్‌లో తెల్లవారుజాము వరకు ఉండి పరిస్థితులను సమీక్షించారని అనిత గుర్తుచేశారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంపై స్పందిస్తూ.. ఆ సంస్థ రూ. 150 కోట్ల బీమా చెల్లించాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వం కేవలం రూ. 12 కోట్లు మాత్రమే కట్టించుకుని చేతులు దులుపుకుందని హోంమంత్రి ఆరోపించారు. అంతేకాకుండా, గంగవరం పోర్టులో ఏపీ ప్రభుత్వానికి రావాల్సిన 10.24 శాతం వాటాను కూడా గత వైసీపీ ప్రభుత్వమే వదులుకుందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడింది తమ కూటమి ప్రభుత్వమేనని, ప్లాంట్ పరిరక్షణ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

# మోదీ మైలురాయి.. ఆలయంలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రత్యేక పూజలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అరుదైన రాజకీయ మైలురాయిని చేరుకున్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిగా అత్యధిక కాలం పదవిలో కొనసాగిన నేతగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ క్రమంలో స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. ఈ చరిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

2014 మే 26న తొలిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోదీ, 2026 జూన్ 10 నాటికి ఎన్నికైన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. గతంలో ఈ రికార్డు జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉండేది. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల నుంచి 1964 మే 27 వరకు నెహ్రూ 4,398 రోజుల పాటు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు విజయం సాధించడం ద్వారా మోదీ ఈ విశిష్ట ఘనతను సొంతం చేసుకున్నారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం ఢిల్లీలోని లోధి రోడ్డులో ఉన్న ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక

పూజలు చేశారు. ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో, మోదీ నాయకత్వంలో దేశానికి స్థిరమైన పాలన లభించడం గర్వకారణమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్లిష్టమైన ప్రపంచ పరిస్థితుల్లో భారతదేశానికి బలమైన, స్థిరమైన నాయకత్వం ఉండటం ఎంతో గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రధానమంత్రి ఇదే అంకితభావంతో, నిబద్ధతతో దేశానికి సేవ చేస్తారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై అత్యధిక కాలం పనిచేసిన ప్రధానమంత్రిగా మోదీ ఒక సరికొత్త మైలురాయిని చేరుకున్నారని ఆయన కొనియాడారు.

# సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ

న్యూఢిల్లీలో బుధవారం జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "సరైన సమయంలో, సరైన స్థానంలో దేశానికి లభించిన సరైన నాయకుడు నరేంద్ర మోదీ" అని చంద్రబాబు అభివర్ణించారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయనకు కృతజ్ఞతా తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రధాని మోదీ ఎల్లప్పుడూ 'నేషన్ ఫస్ట్' అనే నినాదంతో పనిచేస్తారని చంద్రబాబు కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఆర్థిక మందగమనం వంటి అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, మోదీ తన సమర్థవంతమైన పాలనతో దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని చేకూర్చారని గుర్తుచేశారు. ఆయన నాయకత్వ పటిమ వల్లే భారత్‌లో ద్రవ్యోల్బణం అదుపులో ఉందని తెలిపారు. మోదీ ఎన్నడూ అలసిపోరని, నిత్యం ఉత్సాహంగా ఉంటూ అందరిలోనూ స్ఫూర్తిని నింపుతారని ప్రశంసించారు.

సాధారణంగా రాజకీయ కూటములు ఎన్నికల కోసమే ఏర్పడతాయని, కానీ ఎన్డీయే మాత్రం దేశం కోసం ఆవిర్భవించిన కూటమి అని చంద్రబాబు స్పష్టం చేశారు. కేవలం అధికారం కోసం కాకుండా దేశ ప్రయోజనాల పరమావధిగా ఎన్డీయే ప్రయాణం సాగుతోందని, వివిధ రాష్ట్రాల్లో ఈ కూటమి సాధిస్తున్న విజయాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోనే 2047 నాటికి 'వికసిత్ భారత్' నిర్మాణం సాధ్యమవుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. ప్రతి భారతీయుడి మనోభావాలను అర్థం చేసుకున్న గొప్ప నేత మోదీ అని, ఆయన నేతృత్వంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు.

## దిగ్గజ దర్శకుడికి అధికారిక వీడ్కోలు.. తమిళనాడు ప్రభుత్వ కీలక నిర్ణయం

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం వెల్లడించింది. భారతీరాజాకు అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలకాలంటూ తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టీఎఫ్ఏపీఏ) చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

అంతకుముందు టీఎఫ్ఏపీఏ ముఖ్యమంత్రికి ఒక విజ్ఞప్తి చేస్తూ, తమ వ్యవస్థాపకుడైన భారతీరాజాకు ప్రభుత్వ గౌరవం కల్పించాలని కోరింది. దీనిపై వెంటనే స్పందించిన సీఎం విజయ్, ప్రభుత్వ గౌరవ వందనంతో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం పట్ల నిర్మాతల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా టీఎఫ్ఏపీఏ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. భారతీయ చలనచిత్ర రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు భారతీరాజా అని కొనియాడింది. ఒక దర్శకుడిగా ఎన్నో అద్భుతమైన చిత్రాలను రూపొందించడమే కాకుండా, నటుడిగానూ తనదైన ముద్ర వేసి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని ప్రశంసించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ (2004) పురస్కారంతో పాటు 6 జాతీయ చలనచిత్ర అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులు అందుకొని సినిమాకు గర్వకారణంగా నిలిచారని గుర్తుచేసింది. 2020లో నిర్మాతల సంక్షేమం కోసం భారతీరాజా ముందుండి 'తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్'ను స్థాపించారని, ఆయన నాయకత్వ పటిమతోనే ఈ సంఘం నేడు 400 మందికి పైగా క్రియాశీల నిర్మాతలతో బలంగా ఉందని అసోసియేషన్ తెలిపింది. నిర్మాతలు, దర్శకులు, నటీనటుల సంక్షేమం కోసం ఆయన నిరంతరం తపించారని, తమిళ సినిమా అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంది.

**నివాళులర్పించిన సీఎం విజయ్**

అంతకుముందు భారతీరాజాకు సీఎం విజయ్ ఘన నివాళు లర్పించారు. చెన్నైలోని దర్శకుడి నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి, ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన గాఢ సానుభూతిని తెలియజేశారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేధ్కర్ కోనసీమ జిల్లా

# శీల గ్రామానికి తాత్కాలిక ఇన్‌చార్జి గ్రామ సర్వేయర్ నియామకం

**రీ-సర్వే పనుల నిమిత్తం కాశీ విశ్వేశ్వరరావుకు గండేపల్లి మండలానికి బదిలీ**

**కాజులూరు, పెన్ పవర్,జూన్ 10:** కాజులూరు మండలం శీల గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సర్వే దరఖాస్తుల పరిష్కారానికి ఆటంకం కలగకుండా తాత్కాలిక ఇన్‌చార్జి గ్రామ సర్వేయర్‌ను నియమిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు శీల గ్రామ సర్వేయర్ చోడి కాశీ విశ్వేశ్వరరావును రీ-సర్వే పనుల నిమిత్తం గండేపల్లి మండలానికి తాత్కాలిక బదిలీ చేశారు. దీంతో శీల గ్రామంలో సర్వేకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.ఈ నేపథ్యంలో అంద్రంగి గ్రామ సర్వేయర్ టి. శ్రీనివాసును శీల గ్రామానికి తాత్కాలిక ఇన్‌చార్జి గ్రామ సర్వేయర్‌గా నియమిస్తూ కాజులూరు తహసీల్దార్ జి.ఆర్.ఠాగూర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని, శ్రీనివాసు వెంటనే శీల గ్రామంలో సర్వే పనుల బాధ్యతలు స్వీకరించి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.శీల గ్రామ ప్రజలు, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్వే సేవలు నిరంతరంగా కొనసాగించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఉత్తర్వుల ప్రతులను రెవెన్యూ డివిజనల్ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ (ల్యాండ్స్ అండ్ సర్వే రికార్డ్స్), డిప్యూటీ తహసీల్దార్ తదితర సంబంధిత అధికారులకు సమాచారార్థం పంపినట్లు పేర్కొన్నారు.

# అమలాపురంలో గోల్డ్ స్కాం కలకలం






**బోర్డు తిప్పేసిన బంగారం వ్యాపారి రోడ్డెక్కిన బాధితులు**

**కోనసీమ (బ్యూరో) పెన్ పవర్, జూన్, 10:**అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో గోల్డ్ స్కాం వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది... శ్రీ సిద్ధేశ్వర జ్యువెలరీ సంస్థకు చెందిన వ్యాపారి విజయకుమార్ సుమారు రూ. 3కోట్ల మేర లావాదేవీల వ్యవహారంలో ఇబ్బందులు తలెత్తడంతో బాధితులు ఆందోళనకు దిగారు.

తమకు న్యాయం చేస్తానని, సమస్యను పరిష్కరిస్తానని యజమాని హామీ ఇచ్చినప్పటికీ, నిర్ణయించిన సమయానికి ఆయన అందుబాటులోకి రాకపోవడంతో బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధితులు గంటల తరబడి వేచి చూసిన అనంతరం పలువురు మహిళలు,వృద్ధులు సహా బాధితులు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు... తాము కష్టపడి కూడబెట్టిన సొమ్మును సంస్థలో పెట్టుబడిగా పెట్టామని,ఇప్పుడు తమ డబ్బులు తిరిగి వస్తాయో లేదో తెలియని పరిస్థితి నెలకొందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు...

తమకు వెంటనే న్యాయం చేసి, బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా,ఈ వ్యవహారంపై పోలీసు కేసు లేకుండా సమస్యను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు స్థానిక గోల్డ్ మర్చంట్స్ యూనియన్ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

అయితే బాధితులు మాత్రం పూర్తి స్థాయిలో తమ డబ్బులు తిరిగి వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

బాధితుల ఆందోళనతో పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా,ఈ వ్యవహారం ప్రస్తుతం అమలాపురంలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

# ప్రజలకు నూరు శాతం సంతృప్తికరమైన వైద్య సేవలు అందించాలి





**జిల్లా కలెక్టర్ హరీంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 10:** ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజలకు నూరు శాతం సంతృప్తికరమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరీంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు),పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె. నరసింహ నాయక్‌తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అమలవుతున్న పలు కార్యక్రమాల పురోగతిని సుదీర్ఘంగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 24 గంటలూ పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రజా ప్రతిస్పందన ఫోన్ కాల్స్ ద్వారా సేకరించే అభిప్రాయాల్లో ప్రతి ఆరోగ్య కేంద్రం నూరు శాతం సంతృప్తి స్థాయిని సాధించేలా సేవల నాణ్యతను పెంపొందించాలని పేర్కొన్నారు. వైద్యాధికారులు తప్పనిసరిగా ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించడంతో పాటు మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులను నేరుగా కలిసి వైద్య సేవలు అందించాలని సూచించారు.చికిత్సతో పాటు వ్యాధుల నివారణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, జిల్లాలో ఎక్కడైనా వ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉన్నట్లు గుర్తిస్తే మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు, పురపాలక సంఘాల కమిషనర్లతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వైద్యాధికారులు తమ పరిధిలోని సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు కనీసం 60 మందికి పైగా ఓపీ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని,మాతృ మరణాలు, శిశు మరణాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. సంక్రమిత,అసంక్రమిత వ్యాధుల నివారణ,రోగులను అవసరమైనప్పుడు ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేయడం, అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడం వంటి సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. క్షయవ్యాధి వంటి ప్రమాదకర వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి సమర్థవంతమైన చికిత్స అందించాలని, అర్హులైన బాలికలందరికీ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ టీకాలు వంద శాతం అందేలా చూడాలని చెప్పారు. అలాగే ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ ఐడీ కార్డుల నమోదు ప్రక్రియను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని ఆదేశించారు.రాష్ట్ర ఆరోగ్య సూచికల ర్యాంకింగ్స్‌లో కాకినాడ జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదటి పది స్థానాల్లో నిలిచేలా వైద్యాధికారులు, సిబ్బంది అత్యుత్తమ పనితీరు కనబరచాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ చలమయ్య, డాక్టర్ కె.వి.సుబ్బరాజు,డాక్టర్ వి. అరుణ, డాక్టర్ జి. లక్ష్మి, డాక్టర్ ఐ. ప్రభాకర్, డాక్టర్ ఎన్. ప్రశాంతి, కె. సూర్యచంద్రరావు, నీలవేణి, కె. కృష్ణప్రసాద్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీ కార్యకర్తకు మంత్రి సుభాష్ ఆర్థిక సహాయం

**కాజులూరు, పెన్ పవర్ జూన్ 10:**కాజులూరు మండలం ఆర్యవటం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పెంకే అప్పారావు అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా అప్పారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి, ఆయనకు ధైర్యం చెప్పడంతో పాటు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తల సంక్షేమం తమ బాధ్యత అని, అవసరమైన సమయంలో ప్రభుత్వం మరియు పార్టీ తరపున పూర్తి స్థాయిలో అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.అధికారిక, రాజకీయ కార్యక్రమాలతో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ మంత్రి స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించి ఆర్థిక సహాయం అందించడం పట్ల పెంకే అప్పారావు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవటం సొసైటీ అధ్యక్షులు కోట తాతబ్బాయి,బొడ్డు నాగమల్లేశ్వరరావు, సనపల ధనరాజు, కొల్లు హనుమంతరావు,గీసాల రాజు,గీసాల వీరభద్రరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ సేవలను వారు ప్రశంసించారు.



# ఓటు హక్కు పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత





- **ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**
- **మంత్రి వాసంశెట్టి సుభాష్**

**కాజులూరు, పెన్ పవర్,జూన్ 10:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాదిగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు.కాజులూరు మండలం గొల్లపాలెంలో మండల టీడీపీ అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని అన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలంటే ఓటర్ల జాబితా ఖచ్చితంగా ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు.ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేయడం, మరణించిన వారు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లను తొలగించడం,ఓటర్ల వివరాలను నవీకరించడం జరుగుతుందని వివరించారు.ఈ ప్రక్రియతో ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా,విశ్వసనీయంగా మారుతుందని తెలిపారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని సూచించిన మంత్రి, దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి యువత చేతుల్లోనే ఉందని,యువ ఓటర్ల భాగస్వామ్యం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని అన్నారు.బూత్ స్థాయి కార్యకర్తలు,పార్టీ నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని,ప్రజలకు అవగాహన కల్పించాలని,అర్హులైన వారందరినీ ఓటర్ల జాబితాలో నమోదు చేయించాలని కోరారు.రాజకీయ పక్షపాతం లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా చూడాలని సూచించారు.

ప్రజలు కూడా అవసరమైన పత్రాలను సమర్పించి,ఇంటింటా జరిగే పరిశీలనలో పాల్గొని కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని,ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేయించు కోవాలని మంత్రి తెలిపారు.ఖచ్చితమైన ఓటర్ల జాబితా ఎన్నికల విశ్వస నీయతను పెంచి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.అనంతరం నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడుతూ,గత రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమపాళ్లలో అమలు చేస్తూ సుమారు రూ.250 కోట్లతో రామచంద్రపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు.ఇందులో కాజులూరు మండలానికే సుమారు రూ.60 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు.రానున్న పుష్కరాల కోసం మరో రూ.150 కోట్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు.

అలాగే సీఎస్ఆర్ నిధులతో మూడు మండలాల్లో కంటైనర్ ఆసుపత్రులు, సంచార వైద్యశాలలు, ఎలక్ట్రిక్ ఆటోలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందని కొన్ని వైద్య సేవలను కంటైనర్ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు, గుండె సంబంధిత వ్యాధులను ముందస్తుగా గుర్తించే ఆధునిక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కాజులూరు మండల టీడీపీ అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు),వనుం వీరబ్రహ్మం,కోట తాతబ్బాయి,చుండ్రు వీర్రాజు చౌదరి, బొమ్మిడి సోమాలమ్మ, పలివెల రాజు, పోతుల గనిరాజు,పోతురాజు భీమారావు,జల్లి సత్యనారాయణ, రంపాల రాజు,మోకన వాడపల్లి,కొల్లి హనుమంతు చౌదరి,మల్లేష్, పేపకాయల బాబ్జి, అంగర కృష్ణ,కోక హరి,కోమలి వెంకటరమణ,ముమ్మిడి గోపి,రెడ్డి శేషారావు,తోట కృష్ణ,సలాది సాయిబాబు,సలాది శ్రీనివాస్,వల్లు అర్జున్,పితాని సతీష్ కుమార్,ఆకుల సతీష్, క్లస్టర్, కో-క్లస్టర్,బూత్ ఇన్‌ఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# విశాఖ స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి




**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 10:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం సరిపోదని, ప్రతి మృతుడి కుటుంబానికి రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా అందించాలని బహుజన సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా అడ్వైజర్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం జగ్గంపేట మండలంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు మంత్రి నారా లోకేష్ ప్రకటించిన రూ. 25 లక్షల ఆర్థిక సహాయం అభినందనీయమే అయినప్పటికీ, బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న నష్టానికి అది ఏమాత్రం సరిపోదన్నారు. ప్రమాదంలో కుటుంబ పెద్దలను కోల్పోయిన వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, ప్రతి మృతుడి కుటుంబానికి రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలోని ఒకరికి శాశ్వత ఉద్యోగం, అలాగే ఇంటి స్థలం కేటాయించాలని ఆయన కోరారు.

# టీడీపీ అంటేనే నమ్మకం.. చంద్రబాబు అభివృద్ధికి ప్రతీక: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**పెన్ పవర్, ఆత్రేయపురం జూన్ 10:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధికి ప్రతీక అని, తెలుగుదేశం పార్టీ అంటే ప్రజల్లో విశ్వాసానికి చిరునామా అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. అలాగే ఎన్.టి. రామారావు పేరు చెబితే సంక్షేమం గుర్తుకు వస్తుందని అన్నారు.

ఆత్రేయపురం మండలం వాడపల్లిలో బుధ వారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన, ఎన్డీఏ ప్రభుత్వ రెండేళ్ల పాలనలో కొత్తపేట నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. లొల్లలాకుల ఆధునీకరణ, వాడపల్లి దేవస్థానం అభివృద్ధి, పర్యాటక రంగ ప్రోత్సాహం, విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, ఎంఎస్‌ఎంఈల ద్వారా పారిశ్రామిక వాడల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీలు, వీధి విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి పలు కార్యక్రమాలను ప్రస్తావించారు. అదేవిధంగా రైతు భరోసా, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మెగా డీఎస్సీ, ముఖ్యమంత్రి సహాయనిధి వంటి సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, క్లస్టర్ 1 ముదునూరి వెంకటరాజు, ముల్లపూడి భాస్కరరావు, క్లస్టర్ కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, గుడేల నాగేంద్ర గౌడ, పాలింగి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు

# కూటమి పాలనలో జోరుగా అభివృద్ధి, సంక్షేమం

- ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొండబాబు



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 10:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్ల బండిలా ముందుకు తీసుకెళ్తోందని డబుల్ ఇంజిన్ సర్కారుతో కేంద్ర సహకారం అందుకుంటూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వేగంగా నడిపిస్తున్నారని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు ( కొండబాబు) అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం నుంచి రోడ్లు, నీటి పారుదల ప్రాజెక్టుల వరకు ప్రతి రంగంలో పనులు వేగం పుంజుకున్నాయి. ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్, తల్లికి వందనం , అన్నదాత సుఖీభవ పథకాలతో సంక్షేమం అందుతుంది. ఉద్యోగులకు సకాలంలో జీతాలు, విద్య, వైద్యం, ఉపాధి కోసం మెగా డీఎస్సీ నిర్వహణతో యువతకు భరోసా ఇస్తున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ , నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్తోంది. జగ్గంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని కొండబాబు పేర్కొన్నారు.

# పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యం

**టిడిపి మండల అధ్యక్షుడు జీను మణిబాబు**



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 10:** తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని మండల అధ్యక్షులు జీను మణిబాబు అన్నారు. జగ్గంపేట మండల టీడీపీ సర్వసభ్య సమావేశం బుధవారం మండల అధ్యక్షులు జీను మణిబాబు అధ్యక్షతన జరిగింది. జగ్గంపేట మండలానికి సంబంధించిన 10 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించి మంగళగిరి కేంద్ర కార్యాలయానికి పంపారు. ఇకపై ప్రతి నెలా రెండు బుధవారాలు మండల సర్వసభ్య సమావేశం పెట్టాలని డిసైడ్ అయ్యారు. మండల కమిటీ, క్లస్టర్ ఇంచార్జిలు తప్పనిసరిగా హాజరై పార్టీ బలాలు, బలహీనతలపై లోతుగా చర్చించాలని మణిబాబు స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త అభిప్రాయానికి విలువ ఇస్తూ ముందుకు వెళ్తామన్నారు. తీర్మానాల అమలుపై నేరుగా కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకెళ్తామని మణి బాబు అన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, తెలుగు యువత అధ్యక్షుడు రాయి సాయి, సర్వసిద్ధి లక్ష్మణరావు, పోంద్రు బాలనాగు, పీలా మహేష్, నేదూరి గణేష్, బిక్కిన బాబి, పడాల ఈశ్వరరావు, కోడూరి రమేష్, గొర్రెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పథకానికి రూ.11,001 విరాళం




**పెన్ పవర్, ఆత్రేయపురం, జూన్ 10:** ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసి యున్న అతి ప్రాచీనమైన శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయం తెలుగు రాష్ట్రాల్లో విశిష్ట క్షేత్రంగా భక్తుల ఆదరణ పొందుతోంది. ముఖ్యంగా ఐదు బుధవారాల దీక్షను ఆచరించే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని శ్రీ జగన్మోహిని కేశవస్వామివారిని దర్శించుకుని దివ్య ఆశీస్సులు పొందుతున్నారు.

ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం గ్రామానికి చెందిన నమ్మి హరికృష్ణ, సత్యవేణి దంపతులు తమ కుమారులు పెద్ద అబ్బురం, చిన్న అబ్బురం పేరున స్వామివారి అన్నదాన పథకానికి రూ. 11,001లను విరాళంగా అందజేశారు. దాతల కుటుంబ సభ్యుల సంకల్పంతో సమర్పించిన ఈ విరాళాన్ని ఆలయ అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా దాతల పేరున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు దాతలను ఘనంగా సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. భక్తులు సమర్పిస్తున్న విరాళాలతో ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోందని, భక్తుల సహకారంతో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా, నిర్వహించబడుతున్నాయని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి తరలివస్తున్న భక్తులతో ర్యాలి క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటోందని వారు తెలిపారు.

# నేత్రదానం ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపవచ్చు



**కాకినాడ, పెన్ పవర్ జూన్ 10**: మరణం తర్వాత కూడా మనిషి సమాజానికి ఉపయోగపడే గొప్ప సేవ నేత్రదానమని, ఒక వ్యక్తి దానం చేసిన కళ్ల ద్వారా ఇద్దరు అంధులకు తిరిగి చూపు ప్రసాదించవచ్చని ప్రముఖ దంత వైద్యులు డా. అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ నేత్రదాన దినోత్సవం సందర్భంగా రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డా. అడ్డాల పాల్గొని నేత్రదాన ప్రాముఖ్యతపై వివరించారు. ఈ సందర్భంగా అడబాల ట్రస్ట్ సభ్యులు, మహిళలు నేత్రదాన సంకల్ప పత్రాలపై సంతకాలు చేసి తమ మద్దతు తెలిపారు. డా. అడ్డాల మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 10న ప్రపంచ నేత్రదాన దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా అంధత్వ నివారణపై అవగాహన పెంపొందించడం, మరణానంతరం నేత్రదానం చేసేలా ప్రజలను ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్నియా దెబ్బతినడం వల్ల చూపు కోల్పోయిన అనేక మందికి నేత్ర మార్పిడి ద్వారా పూర్తిగా చూపు పునరుద్ధరించవచ్చని తెలిపారు. మరణించిన ఒక వ్యక్తి నుంచి సేకరించిన రెండు కళ్ల ద్వారా ఇద్దరు అంధులకు చూపు కల్పించవచ్చని పేర్కొన్నారు. యువకులు నుంచి వృద్ధుల వరకు ఎవరైనా నేత్రదానం చేయవచ్చని, కంటి అద్దాలు వాడేవారు, శుక్లాల శస్త్రచికిత్స చేయించుకున్నవారు కూడా నేత్రదానానికి అర్హులేనని చెప్పారు. మధుమేహం, రక్తపోటు, ఆస్తమా వంటి వ్యాధులు ఉన్నవారు కూడా తమ కళ్లను దానం చేయవచ్చని వివరించారు. వ్యక్తి మరణించిన వెంటనే గరిష్టంగా ఆరు గంటల లోపు సమీప ఐ బ్యాంక్‌కు సమాచారం అందించాలని సూచించారు. వైద్య బృందం వచ్చే వరకు కనురెప్పలు మూసి ఉంచడం, ఫ్యాన్ ఆపివేయడం, కళ్లపై తడి దూది లేదా తడి గుడ్డ ఉంచడం ద్వారా కార్నియా ఎండిపోకుండా సంరక్షించవచ్చని తెలిపారు. అలాగే తల కింద కొద్దిగా ఎత్తుగా దిండు ఉంచాలని సూచించారు. ఐ బ్యాంక్ వైద్య బృందం కేవలం 15 నుంచి 20 నిమిషాల్లో కంటి పొరను సేకరిస్తుందని వివరించారు. జీవించి ఉన్నప్పుడే నేత్రదాన సంకల్ప పత్రంపై సంతకం చేసి, ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడం ద్వారా ప్రతి ఒక్కరూ ఈ మహత్తర సేవలో భాగస్వాములు కావచ్చని డా. అడ్డాల పిలుపునిచ్చారు. "మనం మరణించిన తర్వాత కూడా ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపే అవకాశం నేత్రదానం ద్వారా లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, నమఃశివాయ, మహిళలు మరియు అడబాల ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు 16 ట్రైసైకిళ్ల పంపిణీ





- పరిశుభ్రమైన నియోజకవర్గ నిర్మాణమే లక్ష్యం
- మంత్రి వాసంశెట్టి సుభాష్

**కాజులూరు, పెన్ పవర్ జూన్ 10:** రామచంద్రపురం నియోజకవర్గంలోని గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసి పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కాజులూరు మండలంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మంజూరు చేసిన ట్రైసైకిళ్లను పారిశుధ్య కార్మికులకు బుధవారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత పరిరక్షణలో పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ మరింత సమర్థవంతంగాజరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులకు మొత్తం 16 ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఇందులో కాజులూరుకు 5, అంద్రంగి 1, ఆర్యవటం 2, దుగ్గుదూరు 3, గొల్లపాలెం 3, జగన్నాధగిరి 1, కోలంకలకు 1 ట్రైసైకిల్ చొప్పున అందజేశారు. ఈ ట్రైసైకిళ్ల ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ సులభతరం అవుతుందని, ఘన వ్యర్థాల నిర్వహణ మరింత మెరుగుపడుతుందని మంత్రి తెలిపారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, తమ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కాజులూరు తహసీల్దార్ గెడ్డం రవీంద్రనాథ్ ఠాగూర్, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొండా వెంకన్న, కొలంక సొసైటీ అధ్యక్షుడు బొండా వెంకట నరసింహ నాయుడు, కూటమి నాయకులు వెలుగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి, వనుం వీరబ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి కె. ఈశ్వరి, ఏవో పద్మలత, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# జనార్ధనస్వామి వారి ఆలయానికి విద్యుత్ బల్బుల వితరణ




**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 10;** ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయానికి చెముడు లంక నేతాజీ స్కూల్ అధినేత తుమ్మా శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యులు స్వామివారి ఆలయంలో విద్యుత్ అలంకరణ నిమిత్తం రూ. 10,900లు బుధవారం ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబుకు అందజేశారు. స్వామివారి ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం దాతలు ముందుకొస్తున్నారని, విద్యుత్ బల్బులు అందించిన తుమ్మా శ్రీనివాస్ ను చైర్మన్ బైరిశెట్టి రాంబాబు అభినందించారు.

# లబ్ధిదారుల ఇంటికే వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ






**కాకినాడ రూరల్, పెన్ పవర్,జూన్ 10:** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తూ కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి ప్రజలతో మమేకమయ్యారు. కాకినాడ రూరల్,కరప మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించిన పిల్లి దంపతులు మొత్తం ఎనిమిది మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను అందజేశారు. గొర్రిపూడికి చెందిన గండి పద్మావతికి రూ.89,578, రమణయ్యపేటకు చెందిన తనికి శంభు ప్రసాద్‌కు రూ.1,20,960, వాతడా దిలీప్ కుమార్‌కు రూ.54,850, చీడిగ గ్రామానికి చెందిన కడలి నాగరత్నంకు రూ.63,893, తిమ్మాపురానికి చెందిన పోలిశెట్టి వెంకటలక్ష్మికి రూ.1,24,200, కోరుపల్లికి చెందిన పలివెల సత్యకు రూ.45,740, కొవ్వాడకు చెందిన చాదా వెంకటలక్ష్మి నరసింహశాస్త్రికి రూ.30,000, రెండో డివిజన్‌కు చెందిన దాసరి రాజేష్‌కు రూ.80,508 విలువైన చెక్కులను అందించారు.ఈ సందర్భంగా పిల్లి దంపతులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ గొప్ప భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. అవసర సమయంలో ప్రజలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాల సృష్టి ద్వారా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, తమ ఇళ్ల వద్దకే వచ్చి చెక్కులు అందజేసిన పిల్లి దంపతులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.






## 'నవచేతన' ఏఐ ఆధారిత బాలల అభివృద్ధి స్క్రీనింగ్‌పై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



**కాజులూరు,పెన్ పవర్,జూన్ 10**: రాష్ట్రంలోని ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'నవచేతన' కార్యక్రమంలో భాగంగా 6 సంవత్సరాల పిల్లల కోసం ఏఐ (కృత్రిమ మేధస్సు) ఆధారిత ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ (ఈసీడీ) స్క్రీనింగ్ నిర్వహణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.కాజులూరు మండలంలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి సాధికారిత అధికారిణి సీ. హెచ్.లక్ష్మి ఆదేశాల మేరకు,తాళ్లరేవు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వై.శ్రీదేవి ఆధ్వర్యంలో ఈ ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టికి అనుగుణంగా రూపొందించిన 'నవచేతన' కార్యక్రమం ద్వారా పిల్లల అభివృద్ధిని శాస్త్రీయ పద్ధతిలో అంచనా వేసి,అభివృద్ధి ఆలస్యాలను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు.నవచేతన యాప్ వినియోగం, పిల్లల అభివృద్ధి సూచికల అంచనా, స్క్రీనింగ్ ప్రక్రియ నిర్వహణ వంటి అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించారు.పిల్లల జీవితంలో తొలి 1000 రోజులు అత్యంత కీలకమైనవని,ఈ దశలో సరైన పోషకాహారం,ఆరోగ్య సంరక్షణ, అభ్యసన అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. దుగ్గుదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన డాక్టర్ స్వాతి మాట్లాడుతూ, నవచేతన కార్యక్రమం ద్వారా పిల్లలలో జనన లోపాలు,వ్యాధులు,పోషకాహార లోపాలు,అభివృద్ధి ఆలస్యాలు మరియు వైకల్యాలను (4ఐలు) ముందుగానే గుర్తించి తగిన సేవలకు అనుసంధానం చేయవచ్చని వివరించారు.అలాగే నవచేతన యాప్ ద్వారా పిల్లల స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు,భాషా అభివృద్ధి,జ్ఞానాత్మక అభివృద్ధి, సామాజిక-భావోద్వేగ వికాసం వంటి కీలక అంశాలను అంచనా వేయవచ్చని తెలిపారు. స్క్రీనింగ్‌లో గుర్తించిన పిల్లలను అవసరమైన సందర్భాల్లో వైద్య సేవలు, జిల్లా ప్రారంభ జోక్య కేంద్రం (డీఈఐసీ) సేవలకు అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు.నవచేతన కార్యక్రమం కేవలం స్క్రీనింగ్ సాధనం మాత్రమేనని,ఇది వైద్య నిర్ధారణ కాదని, తుది నిర్ధారణను వైద్య నిపుణులే నిర్వహిస్తారని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను బాలల సమగ్రాభివృద్ధి కేంద్రాలుగా మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు పి.కనకరత్నం,సి. హెచ్. నాగలక్ష్మి,కె.రమణికుమారి తదితరులు అంగన్‌వాడీ కార్యకర్తలకు వివిధ అంశాలపై శిక్షణ అందించారు. కాజులూరు మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై అవగాహన.. పోషకాహార ఫ్రూట్స్ బౌల్స్ పంపిణీ

**అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'అను మాతృ రక్ష' కార్యక్రమం**





**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 10:** గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిరక్షణతో పాటు తల్లి, శిశు సంక్షేమానికి పోషకాహారం అత్యంత కీలకమని వైద్య నిపుణులు పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ ఎస్. సాయికిరణ్, డాక్టర్ టి. వినిత గర్భిణీ స్త్రీలు పాటించాల్సిన ఆరోగ్య నియమాలు, సమతుల ఆహారం, ఆరోగ్యకర జీవన విధానంపై పలు సూచనలు చేశారు. గర్భధారణ సమయంలో పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యం మెరుగుపడుతుందని వారు వివరించారు.ఈ సందర్భంగా అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న "అను మాతృ రక్ష" కార్యక్రమంలో భాగంగా డా. తిరు మాపటి సౌజన్యంతో సమకూర్చిన అధిక పోషక విలువలు కలిగిన ఫ్రూట్స్ బౌల్స్‌ను గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణీలలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు పోషకాహార ప్రాముఖ్యతను తెలియజేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.కార్యక్రమంలో అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, అన్నపూర్ణ శ్యామ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ శామ్యూల్ రాజు, సత్యనారాయణ, స్టాఫ్ నర్సులు అన్నపూర్ణ, నాగమణి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు. తల్లి-శిశు సంక్షేమం కోసం ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వారు అభిప్రాయపడ్డారు.

## డేటా స్ట్రక్చర్స్ మరియు అల్గారిథమ్స్ ద్వారా సమస్య పరిష్కార నైపుణ్యాలు అంశంపై అధ్యాపక శిక్షణ




**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 10:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఫ్రెష్‌మన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "డేటా స్ట్రక్చర్స్ & అల్గారిథమ్స్ ద్వారా సమస్య పరిష్కార నైపుణ్యాలు" అనే అంశంపై మూడు రోజుల అధ్యాపక శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది అని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా.మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. .ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులలో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు అల్గారిథమిక్ విధానాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని వివరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు అధ్యాపకుల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడంలో మరియు బోధన ప్రమాణాలను ఉన్నతీకరించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మట్టి మాఫియా రాజ్యమేలుతోంది రోడ్లపై తిరగాలంటే భయమేస్తుంది ?అధికారుల మౌనం ఎవరి కోసం? మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ సూటి ప్రశ్నలు




**కాకినాడ బ్యూరో( పిఠాపురం) జూన్, 10** పిఠాపురం నియోజకవర్గంలో మట్టి మాఫియా అరాచకాలు శృతిమించాయని, అధికార యంత్రాంగం పర్యవేక్షణ కరువవడంతో... నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని మన ఊరు మన బాధ్యత సంస్థ సభ్యులు ఆరోపించారు. ఈ తవ్వకాల వల్ల ప్రజలు ప్రాణభయంతో బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని మన ఊరు-మన బాధ్యత'

స్వచ్ఛంద సేవా సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. స్థానిక శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో జరిగిన మీడియా సమావేశంలో సంస్థ అధ్యక్షులు కొండేపూడి శంకరరావు రాపర్తి చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ఎంత లోతు తవ్వాలో స్పష్టత ఉన్నప్పటికీ, వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదని, ఏకంగా 20 నుండి 30 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరుపుతున్నారని, దీనివల్ల భారీ గోతులు ఏర్పడి పశువులు, మనుషులు ప్రమాదవశాత్తు అందులో పడి మరణించే పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 50 టన్నుల బరువుతో కూడిన లారీలు గ్రామాల్లోని రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, యూ.కొత్తపల్లి మండలం ఇసుకపల్లి గ్రామ ప్రజలు ఇప్పటికే లారీలను అడ్డుకోగా, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ రవాణాపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. పిఠాపురం పట్టణంలో వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఇటీవల అంగవైకల్యం ఉన్న వ్యక్తిని లారీ ఢీకొట్టిన ఘటన, లారీల నుండి రోడ్లపై పడుతున్న మట్టి వలన ద్విచక్ర వాహనదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ... మాఫియా అరాచకాలకు అద్దం పడుతున్నాయని అన్నారు.

మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది ఎవరు? ఎవరి అండదండలతో ఈ మాఫియా ఈ స్థాయిలో చెలరేగిపోతోంది? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకపోవడం వెనుక పెద్దల ప్రమేయం ఉందని ఆరోపించారు. ఈ అక్రమాలపై సమగ్ర వివరాలను ఆర్టీఐ ద్వారా సేకరిస్తున్నామని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని శంకరరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అల్లవరపు నగేష్, కాగిత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కడప క్రికెట్ టోర్నీలో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన అడబాల




**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 10;** ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన అడబాల శ్రీ రామకృష్ణ ఆల్ రౌండ్ చాంపియన్ గా నిలిచారు. కడపలో ఈనెల 4న ప్రారంభమైన ఈ టోర్నమెంట్ కు రాష్ట్ర వ్యాప్తంగా 40 జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమండ్రి జట్టు- విశాఖ జట్టు తలబడ్డాయి. చివరికి రాజమండ్రి జట్టు విజయం సాధించింది. అడబాల బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి మొదటి టీమ్ పై మాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని అందుకున్నారు. ఈ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉన్న రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ఎస్సీ తిలక్ కుమార్ ప్రోత్సాహంతో ఈ జట్టు విజేతగా నిలిచింది. ప్రస్తుతం కడియం మండలం దుళ్ల విద్యుత్ లైన్ మెన్ గా పనిచేస్తున్న అడబాల జట్టు విజయానికి కీలక పాత్ర పోషించడంపై తిలక్ కుమార్ తో పాటు కెప్టెన్ బల్జి వాసు టీం ప్లేయర్స్ పలువురు విద్యుత్ శాఖ అధికారులు అభినందించారు. ఇదిలా ఉండగా ఈ జట్టు ఇప్పటి వరకు తొమ్మిది సార్లు చాంపియన్ గా నిలిచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది.ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఏ జట్టూ ఇన్ని సార్లు టోర్నమెంట్ విజేతగా లేక పోవడం విశేషం.

## వైభవంగా చెముడులంక దుర్గమ్మ వారి తీర్థ మహోత్సవం



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 10;** ఆలమూరు మండలం చెముడులంక విశాలాక్షి దుర్గమ్మ వారి తీర్థ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. జాతీయ రహదారిని అనుకుని ఉండే ఈ ఆలయానికి లంక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుండి భక్తులతో కిటకిలాడింది.అమ్మవారికి నైవేద్యాలతో మొక్కుబడులు తీర్చుకున్నారు. తీర్థ మహోత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ అలంకరణలతో తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# పెదపూడిలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ క్షేత్రస్థాయి పర్యటన



**కాకినాడ, బ్యూరో (పెదపూడి) జూన్, 10:**సామాజిక ఆరోగ్య కేంద్రం, స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం పెదపూడి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, స్వర్ణ గ్రామ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలను ఆయన పరిశీలించారు.

ముందుగా సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఓపి రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఇన్-పేషెంట్, అవుట్-పేషెంట్ల వివరాలను ఇతర రికార్డుల తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మందుల నిల్వలు, వాటి పంపిణీ తీరును పరిశీలించడంతో పాటు ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి వైద్య సేవలు పొందుతున్న వారితో మాట్లాడి వివరణ అడిగి తెలుసుకున్నారు. ప్రాంగణంలోని పారిశుధ్య నిర్వహణ, తాగు నీరు, నిర్మాణం పనులను పరిశీలించి వైద్య అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు ఎల్లప్పుడూ నాణ్యమైన, నమ్మకమైన వైద్య సేవలు అందించేలా వైద్య అధికారులు, సిబ్బంది ప్రత్యేక కృషి చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వాట్సాప్ గవర్నెన్స్, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం, జలధార – జల హారతి పనులు, రీ సర్వే పనుల పురోగతిని ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వివిధ ప్రభుత్వ సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. పెదపూడి మండలంలో జలధార – జలహారతి కార్యక్రమం 180 పనులు మంజూరు చేయగా ఈ పనులన్నీటికి గ్రౌండింగ్ పూర్తయిందన్నారు. ఇందులో ఇప్పటివరకు 34 పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన పనులపై ప్రత్యేక దృష్టి జూన్ చివరినాటికి నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులు ఆదేశించారు. పీజీఆర్ఎస్ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి సంతృప్తి స్థాయిని పెంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

అనంతరం పెదపూడి ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, అందులోని వసతులను పరిశీలించారు.

పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెదపూడి మండలం తహసీల్దార్ పీ.వీ.సీతాపతిరావు, ఎంపీడీవో కే. నరేంద్ర రెడ్డి, వైద్య అధికారిణి డా.పి.అనుషా ఇతర శాఖల మండల స్థాయి అధికారులు, వైద్య సిబ్బంది సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ సర్వసభ్య సమావేశం

- కీలక తీర్మానాలకు ఆమోదం
- మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు





**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 10**

గండేపల్లి జూన్ 10 : గండేపల్లిలో బుధవారం మండల టీడీపీ సర్వసభ్య సమావేశం హోరెత్తింది. రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, మండల టీడీపీ అధ్యక్షులు పోతుల మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ప్రజా సమస్యలపై నిప్పులు చెరిగారు. క్లస్టర్ ఇన్‌చార్జిలు అడబాల భాస్కర్ రావు, జాస్తి వసంత్, పాలకుర్తి ఆదినారాయణతో పాటు మండల కమిటీ, యూనిట్ ఇన్‌చార్జిలు, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు. టీడీపీ రెండేళ్ల పాలనపై సుదీర్ఘ సమీక్ష జరిగింది.

సమావేశంలో ఆమోదించిన కీలక తీర్మానాలు:

ఇళ్ల స్థలాలు, ఇల్లు రుణాలు: అర్హులందరికీ వెంటనే మంజూరు చేయాలి

ఎన్టీఆర్ పెన్షన్లు: కొత్త పెన్షన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

స్త్రీ శక్తి పథకం మహిళలకు పూర్తిస్థాయిలో అమలు చేయాలి

మౌలిక వసతులు గ్రామాల్లో విద్యుత్ కోతలు, డ్రైనేజీ సమస్యలు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలి

ఈ తీర్మానాలన్నింటినీ మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి పంపించారు.

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్‌కు కృతజ్ఞతలు

నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలు చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్‌కు సమావేశం కృతజ్ఞత తీర్మానం చేసింది.

పోతుల మోహనరావు విజ్ఞప్తి:

ప్రజా సమస్యలు పరిష్కరించడం లో టిడిపి ముందుంటుందని అన్నారు . ఇళ్ల స్థలాలు, రోడ్లు, డ్రైనేజీలపై ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు ."

ఈ కార్యక్రమంలో గండేపల్లి సొసైటీ చైర్మన్ కంటిపూడి, గండేపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లం రెడ్డి రామకృష్ణ, సత్యనారాయణ, యూనిట్ ఇన్చార్జులు కుంచే రామకృష్ణ, పాలకుర్తి లక్ష్మీపతిరావు, పైన్ని వెంకటేశ్వరరావు, కొల్లిన వాసు, యిప్పర్ల సురేష్, కాటేపల్లి భద్రరావు, బోండా శ్రీనుబాబు, ముమ్మన సుబ్బారావు, గొల్లవిల్లి అన్నవరం, మైలవరపు శ్రీను, అక్కిన సుదర్శన్ రావు, అక్కిన నాగేశ్వరరావు అధిక సంఖ్యలో మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# కత్తిపూడిలో టీడీపీ ఎస్ఐఆర్, మండల స్థాయి క్లస్టర్ సమావేశాలు..

- పార్టీ బలోపేతం, ఓటరు జాబితా సవరణపై వెన్నా శివ,పర్వత సురేష్ దిశానిర్దేశం....





**శంఖవరం పెన్ పవర్ జూన్ 10:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు ఈగల దేవుళ్ళు ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ కార్యక్రమంతో పాటు మండల స్థాయి క్లస్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్,క్లస్టర్ 7 ఇంచార్జి వెన్నా శివ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, క్లస్టర్ 8 ఇంచార్జి పర్వత సురేష్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని, ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా బూత్ స్థాయి నాయకులు బాధ్యతతో పనిచేయాలని తెలిపారు. అలాగే మండల,క్లస్టర్,యూనిట్ స్థాయిల్లో సమన్వయం పెంచుకుంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని సూచించారు.రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నాయకులు వీర్ల సూరిబాబు, బొమ్మిడి సత్తిబాబు, బద్ది రామారావు, గాబు కృష్ణ మూర్తి,

సాదనాల లక్ష్మిబాబు, కీర్తి సురేష్, కర్రి శివాజీ, మందపల్లి కృష్ణ, కొయ్యా రమణ, పీర్ల నాగేశ్వరరావు,పోకల ప్రసాద్,క్లస్టర్ ఇన్‌చార్జులు,యూనిట్ ఇన్‌చార్జులు,బూత్ స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ముగిసిన క్రికెట్ లీగ్ మ్యాచ్ లు





**గండేపల్లి, పెన్ పవర్, జూన్ ,10:**గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామ శివారున గండేపల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కోలా కుమారస్వామి ఆధ్వర్యంలో అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించిన క్రికెట్ లీగ్ మ్యాచ్ లు బుధవారం తో విజయవంతంగా ముగిసాయి.ఈ కార్యక్రమానికి టిడిపి గండేపల్లి క్లస్టర్ ఇంచార్జి జాస్తి వసంత్,మాజీ సర్పంచ్ లు అడబాల రామాంజనేయులు,పోకల సుబ్బారావు లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగియున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఎఫ్ పిఓ ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా ఐక్యమత్యానికి దోహద పడతాయని పేర్కొన్నారు. విజేతగా నిలిచిన విన్నర్ టీంకు ట్రోఫీతో పాటు 5 వేలు నగదును, రన్నర్ టీంకు ట్రోఫీతో పాటు 3 వేలు నగదును వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్, గండేపల్లి మండల వ్యవసాయ అధికారిణి లక్ష్మి చేతుల మీదుగా అందజేశారు.మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ లీగ్ లో కనబరిచిన 16 మంది ఆటగాళ్ల కు 16 స్మార్ట్ వాచ్ లను,మ్యాచ్ లలో 50 పరుగులు తీసిన నలుగురు కు ప్రత్యేక నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ పిఓ ప్రతినిధులు, క్రీడాకారులు,స్థానిక ప్రజలు పాల్గొని మ్యాచ్ ను విజయవంతం చేశారు.

# ఎరువుల బుకింగ్ యాప్ పై అవగాహన...



**శంఖవరం పెన్ పవర్ జూన్ 10:-** రైతులు తమ పంటలకు కావాల్సిన ఎరువులను ఇంటివద్ద నుంచే బుక్ చేసుకోవచ్చని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు.జాతీయ ఎరువుల విక్రయ ఫ్రేంవర్క్ లో భాగంగా కత్తిపూడిలో రైతులకు అవగాహన కల్పించారు.ఈ యాప్ ద్వారా తమకు కావాల్సిన వివిధ రకాల ఎరువులను బుక్ చేసుకోవడం ద్వారా సమయం,డబ్బులు ఆదా చేసుకోవచ్చని వివరించారు.ఈ విధానంలో తమ సందేహాలకు తమ పరిధిలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఖేత్ బచావో అభియాన్ లో భాగంగా సమగ్ర ఎరువుల వాడకం ద్వారా భూసారాన్ని కాపాడి పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.ఉద్యాన సహాయకులు గోవిందరాజు, రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 10**

మండలంలోని సింగర్ పాలెం వెళ్లే రహదారిలో ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు సింగరం పాలెం రోడ్లో గండేపల్లి గ్రామం దుర్గమ్మ గుడి ఎదురుగా సింగరాయపాలెం నుండి గండేపల్లి వైపుకు వచ్చుచున్న బైకు ఆ సామి తన బైకును అతి వేగంగా నిర్లక్ష్యంగా ఎటువంటి హారన్ కొట్టకుండా గండేపల్లి నుండి సింగరాయపాలెం వైపుకు వెళుతున్న మోటార్ సైకిల్ ఆసామిని గుద్దడంతో గండేపల్లి గ్రామానికి ,చెందిన కట్టుమోతు శ్రీను, వయసు( 52) సంవత్సరాలు , అనువారికి బలమైన గాయాలు అయ్యి చనిపోయినాడు. గండేపల్లి ఎస్సై యు, వి, శివనాగ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

# ఎస్ టి యు సేవలు ప్రశంసనీయం






**పదవ తరగతి విద్యార్థుల అభినందన సభలో ఎమ్మెల్యే బండారు.**

**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 10;**కేవలం ఉపాధ్యాయ సంఘం గా ఉద్యమాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు నిరంతరం ప్రేరణ కల్పిస్తూ పాలిటెక్నిక్ కోచింగ్ విద్యార్థులకు ట్యూషన్స్ నిర్వహణ వంటి సేవా కార్యక్రమాలలోనూ ఎస్ టి యు ఆలమూరు మండల శాఖ చురుకుగా పాల్గొంటుందని ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ఎస్ టి యు సేవలను కొనియాడారు. ఈ విద్యా సంవత్సరం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు మించి ఫలితాలు రాబట్టాయని ఇందుకు కారణమైన ప్రభుత్వ విద్యారంగం లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ అభినందించారు.ఆలమూరు మండల పరిధిలోని ఏడు ప్రభుత్వ రంగ పాఠశాలల నందు విద్యనభ్యసించి అత్యధిక మార్కులు సాధించిన 21 మంది విద్యార్థులకు, ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ఘనంగా సత్కరించి, నగదు బహుమతిని అందజేశారు.అలాగే ఈ 2025-26 సంవత్సరం ఆలమూరు ఎస్ టి యు విద్యా భవన్ నందు నిర్వహించిన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ నందు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 713 వ ర్యాంకు సాధించిన విద్యార్థి కోలాటి చెరిష్ జయ సూర్యను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు మండల శాఖ అధ్యక్షులు సలాది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వాసా దుర్గాప్రసాద్, ఆర్థిక కార్యదర్శి ముంగమూరి దాస్, విద్యా భవన్ కన్వీనర్ కేఎస్ఎన్ మూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ జిఎస్ చక్రవర్తి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కే.సుజాత, జిల్లా బాధ్యులు ఉడతా వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు రాజగోపాల్, ఏసురాజు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం మండల అధ్యక్షులు ఈదల సత్తిబాబు,సలాది నాగేశ్వరావు, వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు, కేతా రాంబాబు, బూసి విద్యా ప్రసన్న , ముప్పిరి వెర్రియ్య, మానేపల్లి శ్రీను తదితరులుఉన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రైతులు సాగు సమాయత్తం కావాలి.

**ఖేత్ బచావో కార్యక్రమంలో ఏఓ జోకా అమృత.**



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 10:**ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో బుధవారం సాగుకు సమాయాత్తం,ఖేత్ బచావో కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఖరీఫ్ సాగుకు సంబంధించిన పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏఓ జోకా అమృత మాట్లాడుతూ భూమి సారాన్ని కాపాడుకోవడానికి రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి,సేంద్రియ పద్ధతులు,పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు.భవిష్యత్ తరాలకు సాగు భూములను పరిరక్షించుకోవడం కోసం ప్రతి రైతు బాధ్యత తీసుకోవాలన్నారు.ఎరువుల పంపిణీలో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని వివరిస్తూ,రైతులు ఎన్ఎఫ్ఎస్ఎఫ్ యాప్ ద్వారా ఎరువులను ముందుగానే బుక్ చేసుకోవాలని తెలిపారు.బుకింగ్ అనంతరం రైతుల మొబైల్‌కు క్యూఆర్ కోడ్ వస్తుందని,క్యూఆర్ కోడ్‌ను చూపించి గుర్తింపు పొందిన డీలర్ల వద్ద,రైతు సేవా కేంద్రాలవద్ద గాని సహకార సంఘాల ద్వారా ఎరువులు పొందవచ్చని వివరించారు.అలాగే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అనుకూలమైన పంటలు, నీటి లభ్యతకు అనుగుణమైన పంటల ఎంపిక,సమతుల్య ఎరువుల వినియోగం,పంటల నిర్వహణ తదితర అంశాలపై రైతులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది,పలువురు రైతులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఎస్ఎస్‌సీ ప్రతిభావంతులైన బీసీ విద్యార్థులకు ఘన సన్మానం





**ప్రతిభకు పట్టం కట్టిన బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం**

**కొత్తపేట,పెన్ పవర్,జూన్ 10:**కొత్తపేట మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బీసీ విద్యార్థులకు బుధవారం ఘనంగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. స్థానిక కమ్మి రెడ్డిపాలెంలోని గౌతమి పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పితాని నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విద్యే ప్రధాన సాధనమని అన్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజాభివృద్ధికి తమ వంతు సేవలు అందించాలని పిలుపునిచ్చారు.మండల విద్యాశాఖ అధికారి మట్టపర్తి హరిప్రసాద్ మాట్లాడుతూ విద్య వ్యక్తిగత అభివృద్ధితో పాటు కుటుంబం, సమాజం అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులు విద్య ప్రాముఖ్యతను చాటి చెప్పారని పేర్కొన్నారు.
మండలంలోని 11 ఉన్నత పాఠశాలల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బీసీ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయగా, ఇతర ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ. 1,500 చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. కొందరు విద్యార్థులను మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు.
ఈ కార్యక్రమంలో ఏ. వెంకటేశ్వరరావు, అవిడి రత్తాలు, చోడే మూర్తి, బి. రామకృష్ణ, కాకి శ్రీను, గుత్తుల శ్రీను, బీసీ ఉద్యోగులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో విద్యాపట్ల మరింత ఆసక్తి పెంపొందించేందుకు దోహదపడిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఎండోమెంట్స్ శాఖకు బదిలీ చేయడం హర్షణీయం



**ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన చిలకమర్తి**

**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 10:**
బ్రాహ్మణ సంక్షేమానికి మరింత ప్రాధాన్యం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని మందపల్లి దేవస్థానం ట్రస్టీ, కొత్తపేట నియోజకవర్గ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ చిలకమర్తి సావిత్రి,శ్రీనివాస్ పేర్కొన్నారు.
బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఈడబ్ల్యూఎస్ విభాగం నుంచి ఎండోమెంట్స్ శాఖ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.ఈ నిర్ణయం ద్వారా బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరిగే అవకాశముందని తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు.
భవిష్యత్తులో బ్రాహ్మణుల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి సంబంధించి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంపై టీడీపీ శిక్షణ సమావేశం నిర్వహణ





**క్లస్టర్, బూత్ స్థాయి బాధ్యులకు దిశానిర్దేశం**

**కాకినాడ , పెన్ పవర్,జూన్ 10:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి శిక్షణ సమావేశం నిర్వహించారు.
కాకినాడ శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో క్లస్టర్, కో–క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్, కో–యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లు, కో–బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, ప్రజలకు అవగాహన కల్పించే అంశాలు, అర్హులైన ప్రతి ఓటరు పేరును జాబితాలో నమోదు చేయడం, తప్పుల సవరణ వంటి అంశాలపై పార్టీ నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర పావని తిరుమల కుమార్ పాల్గొని ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాబోయే రోజుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ స్థాయిల బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటర్లు పరిశీలనపై ప్రత్యేక ధ్రుష్టి పెట్టాలి.




- **ఓటర్ల జాబితా సవరణపై బీఎల్ ఏలకు అవగాహన తప్పనిసరి.**
- **కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు..**

**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 10;**అర్హులైన ఓటర్లు ఎవరూ ఓటు కోల్పోకుండా చూడాలని,ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) పై బిఎల్‌ఏలకు అవగాహన తప్పనిసరని, బీఎల్‌ఏలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. బుధవారం సాయంత్రం ఆలమూరు మండలంలో కొత్తూరు సెంటర్ ఎస్ జె ఆర్ కళ్యాణ మండపంలో మండల టిడిపి అధ్యక్షుడు ఈదల సత్తిబాబు,మండల టిడిపి ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరావు అధ్యర్యంలో కార్యకర్తలతో సర్ పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనందరావు మాట్లాడుతూ”సర్” అనేది ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశమన్నారు. ఈ కార్యక్రమంపై ప్రతి నాయకుడు, కార్యకర్త, ప్రధానంగా బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహన పెంచుకోవాలన్నారు.అర్హులైన ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని కోరారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు తొలగించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జులు, కో ఇన్చార్జిలు,యూనిట్ ఇంచార్జిలు, యూనిట్ కో ఇన్చార్జిలు,బూత్ లెవెల్ ఏజెంట్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు భారీ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలి.

- **ప్రత్తిపాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.**



**కిర్లంపూడి, పెన్ పవర్,జూన్, 10:**చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు ఫైర్ స్టేషన్ నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు నిర్వహించే భారీ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే నిరసన ర్యాలీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీలు,ఎంపీపీలు, ఎంపీటీసీలు,సర్పంచులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, గ్రామ కమిటీ నాయకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు.

## మస్తార్లలో తేడా జరిగితే సహించేది లేదు

**ఎంపీడీవో హరికృష్ణ సత్య రెడ్డి**



**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 10:**ఉపాధి కూలీల మస్తార్ల లో తేడాలు జరిగితే సహించేది లేదని ఫీల్డ్ అసిస్టెంట్లను స్థానిక ఎంపీడీవో హరికృష్ణ సత్య రెడ్డి హెచ్చరించారు. మండల పరిధి తాళ్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని నల్ల చెరువులో పనులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీలను పరిశీలించేందుకు వెళ్లిన ఆయన మస్తర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నిర్వహణలో తేడాలు రాకుండా ఫీల్డ్ అసిస్టెంట్ లో చూసుకోవాలని అలాగే ఎంతమంది కూలీలు వస్తే అంతమంది కూలీలకే మాస్టర్లు వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నియెడల ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని హెచ్చరించారు. కూలీలు ఎండ తీవ్రత తగలకుండా ఉదయాన్నే పనులు నిర్వహించేందుకు నిర్ణయించిన ప్రదేశాలలో చేరుకుని పనులు నిర్వహించాలని సూచించారు. అలాగే ఎండ తీవ్రత తిరగకుండా పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఉపయోగపడుతుందన్నారు. కొలతలు ప్రకారం పనులు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన కూలి రేట్లు కూలీలకు లభిస్తాయన్నారు. అది గమనించి ప్రతికూలి కొలతలకు సరిపడా పనులు నిర్వహించుకోవాలన్నారు.

# కొత్తపేట ఆర్డీవో జి.వి.వి. సత్యనారాయణకు టీడీపీ నాయకుల అభినందనలు



**కొత్తపేట, పెన్ పవర్,జూన్ 10:** కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్డీవో) నియమితులై బాధ్యతలు స్వీకరించిన జి.వి.వి. సత్యనారాయణను మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కొత్తపేట టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో ఎన్నికల సమయంలో కొత్తపేట ఆర్డీవోగా విధులు నిర్వహించిన సత్యనారాయణ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు సుపరిచితులని నాయకులు పేర్కొన్నారు. తిరిగి బదిలీపై కొత్తపేటకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన గతంలో చూపిన చొరవను గుర్తు చేసుకుంటూ, ప్రస్తుతం కూడా అదే విధంగా ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, ధర్నాల రామకృష్ణ, మిద్దె ఆదినారాయణ, సిద్ధంశెట్టి సత్యనారాయణ, గుబ్బల మూర్తి తదితర టీడీపీ నాయకులు పాల్గొని ఆర్డీవోకు అభినందనలు తెలిపారు.

# విద్యతో పాటు దేశానికి క్రీడలు అత్యవసరం

**మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం శంకుస్థాపన లో ఎంపీ పురంధేశ్వరి**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 10 :** దేశ అభివృద్ధికి విద్య ఎంత అవసరమో క్రీడలు కూడా అంతే అవసరమని ఎంపీ పురంధేశ్వరి అన్నారు. వీఎల్ పురంలో రూ. 13.76 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్టీ పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (ఏరీనా--2) శంకుస్థాపన మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సభాధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎంపీ పురంధేశ్వరి, కమిషనర్ రాహుల్ మీనా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వళన అనంతరం ఎంపీ పురంధేశ్వరి మాట్లాడుతూ, గత పాలకులు ఐదేళ్ల పాటు ప్రజలను మభ్యపెట్టారని, కూటమి ప్రభుత్వ అభివృద్ధిని కార్యాచరణలో చూపుతుంద న్నారు. రాబోయే 7-8 నెలలలో స్టేడియం నిర్మాణం పూర్తవు తుందన్నారు. ఖేలో ఇండియా ద్వారా క్రీడా రంగంలో మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభావంతు క్రీడాకారులకు 'టాప్స్ ద్వారా మెరుగైన శిక్షణ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనేందుకు సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుదన్నారు. ఏరీనా-1 కి రాష్ట్ర ప్రభుత్వం రూ. 28 కోట్లు నిధులు కేటాయించగా, ఏరీనా-2 కి రూ. 13.76 కోట్లు కేంద్రం సహకారం అందించినట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారాలతో క్రీడా వసతిని నగరంలో నెలకొల్పనున్నట్లు వివరించారు. క్రీడల్లో బాలికలు ముందుకు రావాలని.. పి.వి.సింధు, సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారిణులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా క్రీడాకారులు కోరుకున్న ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిం దన్నారు. ఖేలో ఇండియా లో రూ.13.76 కోట్ల నిధులు తీసుకువచ్చిన ఎంపీ పురందేశ్వరి కి కృతజ్ఞతలు తెలిపారు. అరీనా--3 నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి మరో రూ.10 కోట్ల నిధులు తేచ్చేందుకు ఎంపీ పురందేశ్వరి హామీ ఇచ్చారని వెల్లడించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ పోటీలకు ఆతిథ్యం ఇచ్చే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కమిషనర్ రాహుల్ మీనా ప్రసంగిస్తూ, ఇప్పటివరకు సాంస్కృతిక రాజధానిగా గా ఉన్న నగ రాన్ని క్రీడల హబ్ గా తీర్చిదిద్దు తున్నట్లు తెలిపారు. అరీనా--1లో 5 కోర్టులు, అరీనా--2లో 4 కోర్టులు, అరీనా--3లో 4 కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఒకేసారి 13 క్రీడా పోటీలను నిర్వహించ వచ్చినన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక ఫ్లోరింగ్, యాంటీ గ్లేర్ ఎల్ఈడి లైటింగ్, హీటింగ్ వెంటిలేషన్, క్రీడాకారుల భద్రత సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 3,000 మంది కూర్చునేలా, 9,000 మంది ప్రేక్షకులు వీక్షించేలా రూపకల్పనచేస్తున్నామన్నారు. క్రీడాకారులకు జాగింగ్, ఫిట్‌నెస్ ల కోసం అదనంగా స్థలాన్ని కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో , అదనపు కమిషనర్ పి.వి.రామలింగే శ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఈఈ మదర్సా అలీ, క్రీడా ప్రతినిధులు, కోచ్‌లు, విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే ఆదివాసి హక్కుల సాధన





- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర మహాసభ పిలుపు
- తొమ్మిది అంశాలపై తీర్మానాలు ఆమోదం

**గంగవరం ,పెన్ పవర్, జూన్ 10 :** ఆదివాసి చట్టాల సంపూర్ణ అమలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసి సమాజం ఐక్యంగా ముందుకు రావాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్‌పీ) రాష్ట్ర మహాసభ పిలుపునిచ్చింది. పోలవరం జిల్లా గంగవరం మండల కేంద్రంలోని బిర్సా ముండా ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర మహాసభలో ఈ మేరకు పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. సభ ప్రారంభానికి ముందు ఆదివాసి జెండాను ఆవిష్కరించి, విప్లవ యోధుడు బిర్సా ముండా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన మహాసభకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పరిషత్ నాయకులు, కార్యకర్తలు, ఆదివాస్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు మాట్లాడుతూ, ఆదివాసుల భూ హక్కులు, ఉద్యోగాలు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం సంస్థ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో రాజ్యాంగ పరిరక్షణలు సక్రమంగా అమలు కాకపోవడం వల్ల ఆదివాసులు తమ హక్కులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల కుదింపు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మైదాన ప్రాంతాల నుంచి జరుగుతున్న వలసల కారణంగా ఆదివాసి హక్కులు దెబ్బతింటున్నాయని, ఎల్‌టీఆర్ 1/70 చట్ట పరిరక్షణ కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసుల హక్కుల సాధనకు ఐక్యతే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. మహాసభలో మొత్తం తొమ్మిది ప్రధాన డిమాండ్లపై తీర్మానాలు ఆమోదించారు. 1950 నాటి ఐదవ షెడ్యూల్ ప్రాంతాలను అధికారికంగా ప్రకటించి చట్టాలను కఠినంగా అమలు చేయాలని, నాన్-ట్రైబల్స్ వలసలను అరికట్టాలని, అక్రమ కట్టడాలు, ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్‌టీఆర్ 1/70, పెసా, అటవీ హక్కుల చట్టం, ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టాల అమలుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఆదివాసి సంప్రదాయాలు, సంస్కృతి, కస్టమరీ చట్టాలను పరిరక్షించాలని, శ్రీకాకుళం జిల్లాలో మెలియాపుట్టి కేంద్రంగా ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో మైనింగ్ మాఫియా దోపిడీని అరికట్టాలని, ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల ప్రవేశాన్ని నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఏఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను, ఉపాధ్యక్షులు వాబా యోగి, వంతల నాగేశ్వరరావు, ఆదివాస్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు, ఆంధ్రప్రదేశ్ గౌరవ అధ్యక్షుడు తెల్లం రాములు తదితర నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుష్కరాల్లో పర్యాటక, జిల్లా అభివృద్ధి కై కార్యాచరణ

**జిల్లా ప్రాజెక్టులపై ఎంపీ పురంధేశ్వరికి వివరించిన కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 10:** గోదావరి పుష్కరాలు -- 2027ను దృష్టిలో ఉంచుకుని తూర్పుగోదావరి జిల్లాను పర్యాటకం, ఉపాధి, మౌలిక వసతుల రంగాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల పై బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ కీర్తి చేకూరి జిల్లాలో చేపట్టవలసిన పలు అభివృద్ధి ప్రతిపాదనలను వివరించారు.

ఈ సందర్భంగా ఎంపీ పురంధేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, గోదావరి పుష్కరాలను ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకువచ్చే లా వినియోగించు కోవాలన్నారు.

జిల్లాలో జూ పార్క్ ఏర్పాటుకు కేంద్ర స్థాయి బృందం ఏజెన్సీ ప్రాంతాన్ని సందర్శించి అనుకూలతను నిర్ధారించిన విషయాన్ని ప్రస్తావించారు. జిల్లాలోని కార్పొరేట్ సంస్థలు జిల్లాకు అవసరమైన ప్రాజెక్టులకు సిఎస్ఆర్ నిధులను సమీకరించే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. కడియం నర్సరీ ప్రాంతాలను ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, పర్యాటక, సాగునీరు, విద్యుత్, అటవీ శాఖలతో, అధికారులతో సమన్వయం, సహకారం అందిస్తామని ఎంపీ పురంధేశ్వరి హామీ ఇచ్చారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పర్యాటక, విద్య, ఉపాధి కల్పన, పెట్టుబడుల ఆకర్షణకు , సి ఎస్ ఆర్ నిధులతో ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులు, మౌలిక వసతుల సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. పాండవమెట్ట, పిచ్చుకలంక, హ్యావ్‌లాక్ వంతెన, గోదావరి తీరం ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

క్రౌడ్ మేనేజ్‌మెంట్, పర్యావరణహిత మౌలిక వసతులు,కడియం నర్సరీ ప్రాంతాలను అంతర్జాతీయ పర్యాటక ఆకర్షణలుగా తీర్చిదిద్దేందుకు హోమ్ స్టేలు, ఫుడ్ కోర్టులు, పిల్లల వినోద కేంద్రాలు, ఆహార విక్రయ కేంద్రాలు, పర్యాటక సమాచార కేంద్రాల ప్రతిపాదనలు వెల్లడించారు.

జిల్లాలో ఉన్నత విద్యాసంస్థలు, ఐటీ కార్పొరేట్ రంగ పెట్టుబడులు, ఉపాధి విస్తరణ, ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్ , మీడియా పర్యాటక , సిఎస్ఆర్ నిధుల సమీకరణ, ఆస్ట్రో టూరిజం,



బిర్లా ప్లానెటోరియం వంటి వినూత్న ప్రాజెక్టుల ఏర్పాటుపై సమావేశంలో భాగంగా ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, ప్రాంతీయ పర్యాటక అధికారి ఎన్.వి.వి.ఎస్. మూర్తి, ఏపీఈపీడీసీఎల్ సూపరిం టెండింగ్ ఇంజనీర్ కె. తిలక్ కుమార్, జిల్లా అటవీ అధికారి బి. ప్రభాకరరావు, జిల్లా పర్యాటక అధికారి పి. వెంకటాచలం, డి డి వో ధీరజ్ , వివిధ శాఖల అధికారులు, పర్యాటక రంగ ప్రతినిధులు, వెండర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**సీతానగరం, పెన్ పవర్, 10:జూన్ :** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీతానగరం పోలిసులు పట్టుకున్నారు. సీతానగరం మడలంలోని మంగళవారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో రఘుదేవపురం ఇసుక ర్యాంపు నుండి గత కొద్ది రోజులుగా అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను ఎట్టకేలకు పోలీసులకు సమాచారం రావడంతో రఘుదేవపురం ఎన్టీఆర్ విగ్రహం వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై బి. వినయ్ ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకుండా ఎవరైనా రాత్రి పూట డే సమయంలో కానీ అక్రమంగా ఇసుక తరలించినట్లయితే ట్రాక్టర్ ఓనర్లపై డ్రైవర్ల పై చట్టరీత్యా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం అందిస్తున్న టోకెన్ విధానం ద్వారా ఇసుక రవాణా చేయాలని ఎస్సై కోరారు.

# ప్రత్యేక సంక్షిప్త సవరణ ను పకడ్బందీగా అమలు చేయాలి

- ఎన్నికల సిబ్బందికి జిల్లా స్థాయి బ్రెయిన్‌స్టార్మింగ్ శిక్షణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 10:** ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ లో ఓటరు జాబితాలను పూర్తిస్థాయిలో హేతుబద్ధీకరించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్రెయిన్ స్టార్మింగ్ శిక్షణ లో కె భాస్కర్ రెడ్డి దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల డిప్యూటీ కలెక్టర్లు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు)కు ప్రత్యేక సంక్షిప్త సవరణ అమలు విధానం, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై భాస్కర్ రెడ్డి సమగ్ర అవగాహన కల్పించారు. ఓటరు జాబితాల ను మెరుగు పరచడంలో ఇంటింటి సర్వే కీలకమని డీఆర్వో పేర్కొన్నారు. బీఎల్‌వోలు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, కొత్తగా అర్హత ఉన్న ఓటర్లను నమోదు చేయాలన్నారు. మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, అనర్హుల వారి వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి నివేదికలను సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం ప్రత్యేక సంక్షిప్త సవరణ న్ని అమలు చేయాలన్నారు. జూన్ 25 నుంచి జూలై 26 వరకు ఇంటింటి ధృవీకరణ నిర్వహించ నున్నట్లు చెప్పారు. అనంతరం ఆగస్టు 1న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. డ్రాఫ్ట్ జాబితా ప్రచురణ అనంతరం ఆగస్టు 1 నుంచి ఆగస్టు 31 వరకు కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణలు, పేర్ల తొలగింపులు తదితర అంశాలపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తారని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తూ పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ప్రతి అర్హు డి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించేలా క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ రిటర్నింగ్ అధికారులు, ఎమ్ ఎమ్ ఆర్ ప్రేమ్ కుమార్, కె భాగ్యలక్ష్మి, కె ఆనంద్ రావు, ఆర్ శివ రాముడు, ఎన్నికల విభాగం అధికారులు, ఎన్నికల డిప్యూటీ కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందాలి

- ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ మల్లేశ్వరరావు ఆదేశాలు



**గంగవరం, పెన్ పవర్, జూన్ 10 :** పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి ప్రతి విద్యార్థి చేతిలో పాఠ్యపుస్తకాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని గంగవరం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మల్లేశ్వరరావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ) గంగవరం ద్వారా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాల పంపిణీ గురువారం ఉదయం 8 గంటల నుంచి చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగవరం వద్దకు హాజరై తమ పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను స్వీకరించాలన్నారు.

పుస్తకాలు తీసుకునేందుకు వచ్చే సమయంలో పాఠశాల ముద్ర (స్కూల్ స్టాంప్) వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యం వహించి ఏ ఒక్క విద్యార్థికి పుస్తకం అందకపోయినా సంబంధిత ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే స్టాక్ పాయింట్ వద్ద పాఠ్యపుస్తకాలు మిగలకుండా పూర్తిస్థాయిలో పంపిణీ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు.